సాక్షి ఒడిశా

శనివారం । 27 । జూలై । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 4,27,123
బంగారం	2 గ్రాముల 450 మిల్లీ గ్రాములు
వెండి	155 గ్రాముల 900 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరి



ముగిసిన రైల్వే ఎన్నికలు

అర్బన్ బ్యాంకు ఎన్నికలు విజయవంతంగా ముగిశాయి. రెండు విడతల్లో జరిగిన పోలింగు తరహాలోనే ఓట్లు లెక్కింపు రెండు విడతల్లో ముగిసింది.

- 8లో



బెంబేలెత్తిస్తున్న బంగాళదుంపలు

రాష్ట్రంలో బంగాళదుంపల సంక్షోభం నెలకొంది. రాష్ట్ర ప్రజల నిత్య వాడకమైన బంగాళ దుంపల ధరలు రెండు రోజుల్లోనే రెట్టింపయ్యాయి.

- 8లో

న్యూస్‌రీల్

తెరిచి ఉన్న చెక్క పెట్టెలు!

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరం రత్న భాండాగారం స్థితిగతుల పట్ల సంచలనాత్మక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. రత్న భాండాగారం ఉన్నత స్థాయి తనిఖీ పర్యవేక్షణ కమిటీ అధ్యక్షుడు జస్టిస్ విశ్వనాథ్ రథ్ తాజా ప్రకటన మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. రత్న భాండాగారం లోపలి గదిలో ఓ ఇనుప పెట్టె ఉంది. దీనికి 2 తాళాలు వేసేందుకు సదుపాయం ఉంది. ఒక తాళం సరిగ్గా ఉండగా, మరొకటి వదులుగా వేలాడుతుందని పేర్కొన్నారు. అలాగే మరో 2 చెక్క పెట్టెలు తాళాలు లేకుండా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. 1978లో రత్న భాండాగారంలోకి ప్రవేశించిన వారు ఇలా తాళాలు వేయకుండా బయటకు వచ్చారని తాను నమ్మలేకపోతున్నానని రథ్ పేర్కొనడం గమనార్హం.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు



ఘటనా స్థలంలో రైలు

భువనేశ్వర్: భువనేశ్వర్ రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణహాని, ఆస్తి నష్టం జరగలేదని తూర్పు కోస్తా రైల్వే అధికారులు వెల్లడించారు. రైలులోని రెండు వ్యాగన్లు పట్టాలు నుంచి జారడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. వాణి విహార్ పాసింజరు హాల్టు స్టేషను వద్ద రైలు కటక్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తాజా ఘటన నేపథ్యంలో మధ్య, ఎగువ లైన్లు ప్రభావితం కాలేదని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది ఎదురుకాలేదని తూర్పు కోస్తా రైల్వే పేర్కొంది.

నేటి సీఎం గ్రీవెన్స్‌సెల్ రద్దు

భువనేశ్వర్: 17వ రాష్ట్ర శాసనసభ తొలి సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదుల విచారణకు అంతరాయం ఏర్పడింది. ఈ మేరకు శనివారం జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల విచారణ రద్దు చేసినట్లు ప్రజాభియోగాల విభాగం ఉత్తర్వులు జారీ చేసింది.

కారు దగ్ధం



మంటల్లో కారు

రాయగడ: రాయగడ నుంచి కొరాపుట్ వైపు వెళుతున్న కారు గుమ్మ ఘాటి సమీపంలో అదుపుతప్పి పక్కనే ఉన్న పొదల్లోకి దూసుకు వెళ్లింది. కారులో షార్ట్ సర్క్యూట్ ఏర్పడటంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో కారులో ఉన్న వెంటనే దిగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనకు సంబంధించి సమాచారం తెలుసుకున్న పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. అప్పటికే బాధితులు కారును విడిచి వెళ్లిపోయినట్లు గమనించారు. ఈ విషయమై ఎటువంటి కేసు నమోదు కాలేదని ఎస్‌డీపీఓ రస్మీరంజన్ సేనాపతి తెలిపారు.

పద్మపూర్ కోర్టుకు మావోయిస్టు నేత ఆజాద్



ఆజాద్‌ను తీసుకొస్తున్న పోలీసులు

రాయగడ: వివిధ కేసుల్లో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటూ జైలు జీవితాన్ని అనుభవిస్తున్న మావోయిస్టు నాయకుడు బి.కే శవరావు అలియాస్ ఆజాద్‌ను శుక్రవారం జిల్లాలోని పద్మపూర్ జ్యుడీషియల్ కోర్టులో పోలీసులు హాజరుపరిచారు. 2008–09లో ప్రజలను బెదిరించి చందాలు వసూలు చేస్తున్నాడన్న ఆరోపణపై పోలీసులు అపట్లో అరెస్టు చేశారు. అప్పటి నుంచి ముద్దాయిగా ఉంటున్న ఆజాద్ బెయిల్ మంజూరు చేయాల్సిందిగా పలుమార్లు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో ఆయన తరఫు న్యాయవాది బ్రహ్మానంద పట్నాయక్ మాట్లాడుతూ ఇప్పటికే ఆజాద్‌పై ఉన్న దాదాపు పది కేసులను కోర్టు కొట్టివేసిందని చెప్పారు. కాగా, కోర్టు విచారణ అనంతరం ఆజాద్‌ను తిరిగి పోలీసులు తీసుకువెళ్లిపోయారు.

పాత పథకాలే కొత్తగా..!

- రాష్ట్ర బడ్జెట్‌లో పేరు మారిన పథకాలు
- సీఎం కిసాన్ యోజనగా కాలియా
- శ్రీ అన్నయోజనగా మిలెట్ మిషన్
- మరికొన్ని పథకాలు ఇదే బాటలో..



స్పీకర్ సురమా పాఢికి బడ్జెట్ ప్రతులను అందజేస్తున్న సీఎం మోహన్‌చరణ్ మాఝీ(ఫైల్)



భువనేశ్వర్: రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ తొలిసారిగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పథకాల పేర్లు మార్పే ప్రధానంగా సాగింది. ప్రజా బడ్జెటుగా అభివర్ణించినప్పటికీ అత్యధిక పథకాలు పాత ప్రభుత్వం బీజేడీ ప్రవేశ పెట్టి అమలు చేసినవాటినే కొత్త పేర్లతో కొనసాగించారు. నవీన్ హయాంలో అమలై కొనసాగుతున్న అనేక పథకాలను మోహన్ చరణ్ మాఝీ ప్రభుత్వం పేరు మార్చి సభలో ప్రవేశ పెట్టింది. కాలియా (కృషక్ అసిస్టెన్స్ ఫర్ లైవ్లీహుడ్ అండ్ ఇన్‌కమ్ అగ్మెంటేషన్) పథకం పేరు సీఎం కిషాన్ యోజనగా కొత్త ప్రభుత్వం మార్చింది. శ్రీ అన్న యోజనగా మిల్లెట్ మిషన్, అమొ ఒడిషా, నవీన్ ఒడిషా పథకం వికసిత్ గాంవ్, వికసిత్ ఒడిషాగా మార్చారు. గ్రామీణ ప్రాంతాల పరివర్తనకు పెద్దపీట వేయడానికి ఈ పథకాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. బిజూ స్వాస్థ్య కల్యాణ్ యోజన గోపబంధు జన ఆరోగ్య యోజనగా పేరు మార్చి ప్రవేశపెట్టారు. ఈ పథకం కింద లబ్ధిదారులు ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నగదు రహిత చికిత్స సౌకర్యాన్ని పొందవచ్చని ముఖ్యమంత్రి తెలిపారు. మో స్కూల్ అభియాన్ పంచశాఖ శిక్షా సేతు అభియాన్‌గా పేరు మార్చుకుని కొత్త బడ్జెటులో యథాతథంగా ప్రత్యక్షమయ్యాయి. బిజూ సేతు యోజన పేరును సేతు బంధన్ యోజన, లక్ష్మి బస్సు పథకం గ్రామాంచల్ పరివహన్‌గా కొత్త పేర్లతో ప్రవేశ పెట్టారు.

అదేవిధంగా ఫ్లాగ్‌షిప్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ 'మేక్ ఇన్ ఒడిషా' కాన్‌క్లేవ్ పేరును ఉత్కర్ష ఉత్కళ్‌గా మార్చనున్నారు. 'ఉత్కర్ష ఉత్కళ' సమ్మిట్‌ల ద్వారా 2029 నాటికి రాష్ట్రానికి రూ.2.5 లక్షల కోట్లకు పైగా దేశీయ పెట్టుబడులు, 2 బిలియన్ డాలర్లకు పైగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ)ను తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు.

సమ్మిళిత అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర బడ్జెట్

2024–25 సంవత్సరానికి రూ.2.65 లక్షల కోట్ల బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం గురువారం పలు కొత్త కార్యక్రమాలను ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ మాట్లాడుతూ, రైతులు, మహిళలు, యువత, పేద ప్రజల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చామని, ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్రాన్ని సమ్మిళితంగా అభివృద్ధి చేయడమే బీజేపీ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

కొత్త కార్యక్రమాలివే..

- జగన్నాథ సంస్కృతిని ప్రోత్సహించడం, ప్రచారం చేసేందుకు జగన్నాథ ఆలయం కార్పస్ నిధికి రూ.500 కోట్లు
- ఘుటొగాంవ్ మా తారిణి ఆలయ పరిక్రమ అభివృద్ధికి రూ.50 కోట్లు
- మహిళా సాధికారత, ఆర్థిక స్వాతంత్ర్యం, వ్యవస్థాపకత అభివృద్ధికి సుభద్ర యోజన కోసం రూ.10,000 కోట్లు
- వరి కొనుగోలు క్వింటాల్‌కు రూ.3,100 కోసం సమృద్ధి కృషక్ యోజన కోసం రూ.5,000 కోట్లు
- ఒడియా ఆత్మ గౌరవం ప్రచారం కోసం రూ. 200 కోట్లతో ఒడియా అస్మిత కార్పస్ నిధి
- రూ.156 కోట్లతో గిరిజన విద్యార్థుల డ్రాపౌట్‌ను పరిష్కరించేందుకు మథో సింగ్ హాత్ ఖర్చు యోజన
- ప్రాథమిక పాఠశాల స్థాయిలో విద్య నాణ్యతను పెంపొందించేందుకు గోదాబరీష మిశ్ర ఆదర్శ ప్రాథమిక విద్యాలయం పథకానికి రూ.50 కోట్లు
- పారిశ్రామిక టౌన్‌షిప్‌లో కార్మికుల హాస్టల్ నిర్మాణానికి పారిశ్రామిక టౌన్‌షిప్‌లలో (ఎస్సీడీఎఫ్) దీన్ దయాళ్ కర్మచారి నివాస్ పథకానికి రూ. 50 కోట్లు
- రూఫ్ టాప్ సోలార్ ప్రాజెక్టులకు (పీఎం సూర్య ఘర్) రాష్ట్ర మద్దతు కింద రూ.100 కోట్లు
- క్యాన్సర్ రోగుల అటెండర్ల కోసం ధర్మశాల-కమ్-గెస్ట్ హౌస్ నిర్మాణానికి రూ.18 కోట్లు
- రూ. 200 కోట్లతో మెడికల్ కాలేజీలు, హాస్పిటల్స్ కార్పస్ నిధి ఏర్పాటు
- పీడియాట్రిక్ (పిల్లల) క్యాన్సర్ ఫెసిలిటీస్ ఏర్పాటుకు రూ.25 కోట్లు
- గ్రామ పంచాయతీ స్థాయిలో సౌర శక్తి ఆధారిత వీధిలైట్ల కోసం రూ.10 కోట్లు
- సంబల్‌పూర్, కటక్‌లోని మహానది తీర ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు రూ. 50 కోట్ల నిధులతో మహానది రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్
- రూ.1 కోటి నిధులతో 100 ఏళ్ల దాటిన 45 పాఠశాలల నిర్వహణకు వారసత్వ పాఠశాల అభివృద్ధి పథకం
- సేంద్రియ వ్యవసాయం ప్రోత్సాహానికి ఒడిశా బలభద్ర జైవిక్ చస్సా మిషన్‌కు రూ.1.5 కోట్ల కేటాయింపు
- ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీ పీఎం–జేఏవై) అమలుకు రూ.500 కోట్లు
- ప్రధాన మంత్రి మాతృ వందన యోజన (పీఎంవీవీవై) అమలుకు రూ.92 కోట్లు
- ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) అమలుకు రూ.25 కోట్లు

రాయగడ రైల్వే డివిజన్‌కు రూ.70 కోట్లు



రాయగడ రైల్వే స్టేషన్, (ఇన్‌సెట్లో) రైల్వే మంత్రితో ఎంపీ బలభద్ర మాఝి

రాయగడ: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న రాయగడ పట్టణంలో రైల్వే డివిజన్ ఏర్పాటుకు సంబంధించి అభివృద్ధి పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో పనులు మరింత ముందుకు సాగేందుకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తాజాగా రాయగడ రైల్వే డివిజన్ ఏర్పాటుకు రూ.70 కోట్ల నిధులు కేటాయించామని ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం లోక్‌సభ సభ్యులు బలభద్ర మాఝి కేంద్ర రైల్వే మంత్రితో ఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వైష్ణవ్ మాట్లాడుతూ అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతున్న రాయగడను రైల్వే డివిజన్‌గా ఏర్పాటు చేసేందుకు 2019లో అప్పటి కేంద్ర రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. అనంతరం 2022లో అన్ని పనులు పూర్తి చేసి ప్రధాని చేతుల మీదుగా డివిజన్ ప్రారంభిస్తామని ప్రకటించారు. అయితే ఐదేళ్లు గడిచినా ఇప్పటి వరకు నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంతో సర్వత్రా నిరసనలు వ్యక్తమయ్యాయి. డివిజన్ ఏర్పాటుకు కేంద్రం సకాలంలో నిధులు మంజూరు చేయకపోవడం, డీపీఆర్ సిద్ధం చేయకపోవడంతో నిర్మాణంలో జాప్యం చోటుచేసుకుంది. ఈ క్రమంలో తాజా బడ్జెట్‌లోనూ ఒక్కరూపాయి కూడా కేటాయించకపోవడంతో ఎంపీ మాఝి సమస్యను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి రూ.70 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

సీఎం దృష్టికి జర్నలిస్టుల సమస్యలు



ముఖ్యమంత్రిని కలిసిన పాత్రికేయ బృందం

భువనేశ్వర్: ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీని జర్నలిస్టుల బృందం శుక్రవారం విధానసభలోని ఆయన ఛాంబర్‌లో కలిసింది. అభివద్ధి, సంక్షేమ ఆధారిత బడ్జెట్‌ను ప్రవేశపెట్టినందుకు ముఖ్యమంత్రిని సీనియర్ జర్నలిస్టు ప్రసన్న మహంతి నేతృత్వంలోని బృందం అభినందించింది. ఈ సందర్భంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ముఖ్యమంత్రికి వివరించింది. దీనిపై ఆయన స్పందిస్తూ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిశీలించి తగు చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జర్నలిస్టులు జితేంద్ర పట్నాయక్, ప్రదీప్త మహాపాత్రో, హరిహర్ చాంద్, ప్రశాంత్ స్వంయి, ప్రీతికాంత నాయక్, సుజిత్ బిసోయ్, దేబాశిష్ సస్మాల్, బిశ్వరంజన్ మహాపాత్రో, సౌమ్య రంజన్ సాహు తదితరులు పాల్గొన్నారు.

నలుగురు కిడ్నాపర్ల అరెస్టు



పట్టుబడిన నిందితులతో పోలీసులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుమ్మా బ్లాక్ కె.కె.సింగి గ్రామానికి చెందిన ప్రచురా లిమ్మాను కిడ్నాప్ చేసిన కేసులో పోలీసులు నలుగురు నిందితులను అరెస్టు చేశారు. బాధితుడిని సురక్షితంగా విడిచిపెట్టిన అనంతరం కేసుకు సంబంధించిన వివరాలను పోలీసులు శుక్రవారం విలేకరులకు వెల్లడించారు. తన భర్త ప్రచురా లిమ్మాను పర్లాకిమిడి పర్లావీధికి చెందిన ఏడుగురు వ్యక్తులు కారులో వచ్చి కిడ్నాప్ చేశారంటూ మినిలిమ్మా అనే వివాహిత జూన్ 24న పర్లాకిమిడి ఆదర్శపోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూ.30 లక్షలు చెల్లిస్తేనే భర్తను విడుదల చేస్తామని, విషయం పోలీసులకు చెబితే చంపేస్తామని మొబైల్ వీడియో ద్వారా బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పటికే రూ.6 లక్షలను ఫోన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసినట్లు తెలిపారు. విచారణ చేపట్టిన పోలీసులు బాధితుడ్ని కిడ్నాపర్లు ఒక చోట నుంచి మరొక చోటకు తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో ప్రచురా లిమ్మాను గంజాం జిల్లా బరకులా గ్రామంలోని చిలికా వద్ద ఓం సాయిబాబా లాడ్జిలో ఉంచగా పోలీసులు దాడులు చేశారు. నిందితులు దీపక్ బెహరా(ఖల్లికోట్) , కబి రాజ్ మల్లి (శాంతినగర్, పర్లాకిమిడి), చైతన్య మల్లి(శాంతినగర్), శివాజీ మల్లి(పర్లాకిమిడి)లను అరెస్టు చేశారు. అనంతరం పర్లాకిమిడిలోని దీపక్ బెహరా ఇంట్లో సోదాలు చేయగా నకిలీ నోట్ల తయారీ యంత్రం, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న మరో ముగ్గుర్ని కూడా త్వరలో పట్టుకుంటామని పర్లాకిమిడి ఆదర్శపోలీసుస్టేషన్ ఐఐసీ ప్రశాంత్ భూపతి తెలిపారు. ఈ కేసులో ఎస్ఐ చంద్ర కంద్ర ప్రధాన్ కీలకంగా వ్యవహరించారు. నిందితులను శుక్రవారం కోర్టుకు తరలించారు.

కంధమల్‌లో కుంభవృష్టి

- జనజీవనం అస్తవ్యస్తం
- హై అలెర్టు జారీ చేసిన ఎస్ఆర్‌సీ
- జయపురంలో పలు ఇళ్లు నేలమట్టం



భువనేశ్వర్: కంధమల్ ప్రాంతంలో వర్షపు నీటిలో చిక్కుకున్న మినీ ట్రక్కు

భువనేశ్వర్/జయపురం/మల్కన్‌గిరి: కంధమల్ జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రోడ్లు, వంతెనలు ముంపునకు గురై జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం హై అలెర్ట్ ప్రకటించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రత్యేక సహాయ కమిషనర్ మాట్లాడుతూ రోడ్లు, వంతెనల పైనుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనాన్ని దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలని మయూర్‌భంజ్, బాలాసోర్, కెంజొహార్ సుందర్‌గడ్, భద్రక్, కేంద్రాపడా, కటక్, జగత్‌సింగ్‌పూర్, పూరీ, ఖుర్దా, జాజ్‌పూర్, ఢెంకనాల్, అంగుల్ కలెక్టర్‌లను ప్రత్యేక సహాయ కమిషనర్‌ను ఆదేశించారు.

జయపురం సమితిలో..

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జయపురం సమితిలో తొమ్మిది ఇళ్లు కూలిపోయినట్లు తహశీల్దార్ ప్రకటించారు. కొంగ గ్రామంలో ఒకటి, బళియలో 5, జయంతిగిరిలో ఒకటి, బయాగుడలో ఒకటి, కేవిడిలో ఒకటి చొప్పున ఇళ్లు నేలమట్టమయ్యాయని, నష్టాలను అంచనా వేస్తున్నామని చెప్పారు.

మా ఇళ్లకు మమ్మల్ని చేర్చండి..

మల్కన్‌గిరి జిల్లాలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి పరిధిలోని నాలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన మోటు వద్ద ట్రక్‌లు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న కలెక్టర్ సచిన్‌పవార్ కలిమెల సమితిలో శుక్రవారం పర్యటించి ట్రక్ డ్రైవర్లతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వారం రోజులుగా ఇక్కడే ఇరుక్కుపోయామని, తమను ఇళ్లకు చేర్చాలని వారంతా విజ్ఞప్తి చేశారు. వెంటనే కలెక్టర్ స్పందించి భోజన, తాగునీటి సదుపాయాలు కల్పించారు.



జయపురం: బలియ గ్రామంలో వర్షాలకు కూలిన ఇళ్లు..



జయపురం: కేవిడిలో ఇంటి పైకప్పు ఎగిరిపోయిన దృశ్యం



జయపురం: బలియ పంచాయతీలో కూలిన ఇలు



జయపురం: జయంతిగిరిలో నేలమట్టమైన ఇల్లు



మల్కన్‌గిరి: రోడ్డు పక్కన నిలిచిన ట్రక్కులు



మల్కన్‌గిరి: కోతకు గురైన రహదారిని పరిశీలిస్తున్న కలెక్టర్

క్లుప్తంగా

చోరీ కేసులో నగదు రికవరీ



బాధితురాలికి నగదు అందిస్తున్న పోలీసులు

రాయగడ: నగదు చోరీ కేసులో నిందితుడిని గుణుపూర్ పోలీసులు పట్టుకున్నారు. బాధితురాలు ఇమోని సాబొరొను స్టేషన్‌కు పిలిపించి రూ.23 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో ఐఐసీ ఉత్తమ్ కుమార్ సాహు, ఎస్‌డీపీఓ బబులి నాయక్, రాయగడ ఎస్‌డీపీఓ రస్మీ రంజన్ సేనాపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ధర్నా



ధర్నా చేస్తున్న ఉద్యోగులు

జయపురం: దీర్ఘకాల డిమాండ్ల సాధనకు విద్యుత్ ఉద్యోగుల శుక్రవారం జయపురం టీపీఎస్‌ఓడీఎల్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఒడిశా విద్యుత్ ఖర్మచారి మహాసంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ఈఎల్‌బీఓ 2014 చట్టాన్ని విద్యుత్ ఉద్యోగులకు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు.

వ్యక్తి ఆత్మహత్య



గురు పూలా మృతదేహం

మల్కన్‌గిరి : ఖోయిర్‌పూట్ సమితి టేక్‌గూడ గ్రామానికి చెందిన గురు పూలా (40) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసిన గురు పూలా కొంతసేపటి తర్వాత బయటకు వెళ్లాడు. కాలకృత్యాల కోసం వెళ్లి ఉంటాడనుకుని భావించి కుటుంబ సభ్యులు నిద్రపోయారు. శుక్రవారం అటువైపుగా వెళ్లిన గ్రామస్తులకు గురు పూలా చెట్టుకు వేలాడుతూ కనిపించడంతో భార్యకు, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఖోయిర్‌పూట్ ఐఐసీ కృష్ణచంద్ర ఇహల్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని ఆరోగ్య కేంద్రానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవన నిర్మాణ కార్మికులకు అండగా..



వృద్ధురాలికి చెక్ అందజేస్తున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్

పర్లాకిమిడి: భవన నిర్మాణ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ అన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో భవన నిర్మాణ శ్రామిక కల్యాణ యోజన ద్వారా 98 మంది లబ్ధిదారులకు సుమారు రూ.50 లక్షల విలువైన చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్మిక ఉపాధి శాఖ అధికారిని భారతీ బెహరా పాల్గొన్నారు.

అనాథ చిన్నారులకు ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న అధికారులు

జయపురం: బొయిపరిగుడ సమితి మహులి పంచాయతీ పరోలీ గ్రామంలో ఇటీవల పిడుగుపాటుకు గురై భార్యాభర్తలు మృతి చెందడంతో ముగ్గురు పిల్లలు బాబుల్‌ముదిలి, రఘురామ్ ముదులి, మయినావతి ముదులి అనాథలయ్యారు. వారికి ఆర్థిక సాయం అందించి పునరావాసం కల్పించాలని కలెక్టర్ వి.కీర్తివాసన్ బొయిపరగుడ బీడీఓను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా శిశు సురక్షా అధికారి శ్రీరాజశ్రీ దాస్, సీడీపీఓ అనిత నాయిక్ శుక్రవారం చిన్నారులను కలిసి వివరాలు సేకరించారు. రూ.6వేలు, బియ్యం అందజేశారు.

లారీ ఢీకొని ఒకరికి గాయాలు

నందిగాం: మండలంలోని నౌగాంకు చెందిన చిన్ని వెంకటేశ్వరరావు(28) శుక్రవారం లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్వర రావు కాపుతెంబూరు కూడలి నుంచి జాతీయ రహదారిపై టెక్కలి వైపు పెట్రోల్ బంకుకు తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా పలాస నుంచి టెక్కలి వైపు వస్తున్న లారీ బలంగా ఢీ కొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. ప్రమాదం గుర్తించిన హైవే పెట్రోలింగ్ సిబ్బంది తమ వాహనంలో క్షతగాత్రు డిని టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

బెంబేలెత్తిస్తున్న బంగాళదుంపలు



సరిహద్దు ప్రాంతంలో స్తంభించిన పశ్చిమ బెంగాల్ బంగాళ దుంపల ట్రక్కులు



బంగాళ దుంపలు

- రాష్ట్రంలో ఒక్కసారిగా రెట్టింపయిన ధరలు
- పశ్చిమ బెంగాల్ నియంత్రణే కారణం
- బ్లాక్ చేస్తే చర్యలు తప్పవు: మంత్రి



మాట్లాడుతున్న పౌర సరఫరాల మంత్రి కృష్ణ చంద్ర పాత్రో

భువనేశ్వర్: రాష్ట్రంలో బంగాళదుంపల సంక్షోభం నెలకొంది. రాష్ట్ర ప్రజల నిత్య వాడకమైన బంగాళ దుంపల ధరలు రెండు రోజుల్లోనే రెట్టింపయ్యాయి. పొరుగు రాష్ట్రం పశ్చిమ బెంగాల్ దుంపల రవాణాను అడ్డుకోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పశ్చిమ బెంగాల్ సర్కారు పట్టు వీడకుంటే ఉత్తరప్రదేశ్ నుంచి ఆలుగడ్డలు దిగుమతి చేసుకుంటామని రాష్ట్ర ఆహార, సరఫరాల మంత్రి కృష్ణచంద్ర పాత్రో హెచ్చరించారు. రాష్ట్రంలో బంగాళ దుంపల సంక్షోభాన్ని నివారించడంలో చొరవ తీసుకోవాలని రాష్ట్ర విపక్ష నేత, బిజూ జనతా దళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ శుక్రవారం పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి లేఖ రాశారు.

ధరలపై మంత్రి సమీక్ష..

రాష్ట్రంలో బంగాళదుంపల ధరలు గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ఆహార, సరఫరాల మంత్రి కృష్ణ చంద్ర పాత్రో శుక్రవారం సమీక్షించారు. పశ్చిమ బెంగాల్ పోలీసులు సునాకొణియా చెక్ గేట్ సమీపంలో బంగాళ దుంపల ట్రక్కుల్ని అడ్డుకోవడంతో రెండు రోజుల కిందట కిలో ధర రూ. 30 ఉండగా.. శుక్రవారం నాటికి రూ. 50కి పెరిగిందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయి ఆలుగడ్డల నిల్వ కేంద్రంలో 7 నుంచి 8 రోజులకు సరిపడా బంగాళ దుంపలు నిల్వ ఉన్నాయని చెప్పారు. మరోవైపు, పశ్చిమ బెంగాల్ తీరుతో రాష్ట్రంలో వ్యాపారులు కృత్రిమ కొరతని ప్రేరేపించి బ్లాక్ మార్కెటింగ్ వ్యవహారాలకు పాల్పడి అవాంఛనీయంగా ధరలు పెంచితే కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. గోదాం రేటు కిలో రూ. 27గా కొనసాగుతుందని, రిటైలు ధర గరిష్టంగా రూ. 32కి మాత్రమే పరిమితం కావాలని మంత్రి స్పష్టం చేశారు. అవసరమైతే మార్కెట్‌ను స్థిరీకరించడానికి ఉత్తరప్రదేశ్ నుంచి బంగాళాదుంపలను దిగుమతి చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.

బీజేడీ నిర్వాకమే..

ప్రస్తుత పరిస్థితికి గత బిజూ జనతా దళ్ ప్రభుత్వమే కారణమని మంత్రి మండిపడ్డారు. రాష్ట్రంలో బంగాళ దుంపలు, ఉల్లిపాయ మిషన్లు విఫలమయ్యాయని విమర్శించారు. గత ప్రభుత్వం ఉల్లి, ఆలుగడ్డల నిల్వ కోసం కోల్డ్ స్టోరేజీల వంటి మౌలిక సదుపాయాలను కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయని దుయ్యబట్టారు. పంట ఉత్పత్తిని పెంచకపోవడంతో తరచూ సంక్షోభ పరిస్థితులు తలెత్తి సామాన్య ప్రజానీకాన్ని ఇబ్బందికి గురు చేస్తున్నాయని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.

మమత బెనర్జీకి నవీన్ లేఖ..

బంగాళా దుంపల కొరత సంక్షోభాన్ని నివారించాలని కోరుతూ రాష్ట్ర ప్రతిపక్ష నేత నవీన్ పట్నాయక్ పొరుగు రాష్ట్రం ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి శుక్రవారం లేఖ రాశారు. రాష్ట్రానికి తరలి వస్తున్న బంగాళాదుంపల లోడ్ ట్రక్కుల్ని సరిహద్దు ప్రాంతంలో అడ్డుకోకుండా చూడాలన్నారు. 2014 లోనూ ఇదే పరిస్థితి ఎదురైందని, ఈసారి కూడా జోక్యం చేసుకొని జావుగా సరఫరా అయ్యేలా చూడాలని అభ్యర్థించారు.

స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనోజ్‌కుమార్

రాయగడ: స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాలలో ఆగస్టు 15న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కలెక్టర్ మనోజ్‌కుమార్ మహాజన్ కోరారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో శుక్రవారం వేడుకల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎప్పట్లాగే ఈసారి కూడా వివిధ పాఠశాలల విద్యార్థులను వేడుకలకు ఆహ్వానించాలని కోరారు. వక్తృత్వ, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించాలని జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారికి ఆదేశించారు. వేడుకలు జరిగే మైదానాన్ని శుభ్రం చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, ఏడీఎం భాస్కర రైతా, రాయగడ మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మీనకేశ్వర మందిర అభివృద్ధికి కృషి



మీనాజోలలో పర్యటించిన సబ్ కలెక్టర్ కౌర్, అధికారులు

రాయగడ: చంద్రపూర్ సమితి హనుమంతపూర్ పంచాయతీ మీనజోలలో ప్రముఖ శైవక్షేత్రం మీనకేశ్వర మందిరాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. దీనిలో భాగంగా గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్‌దీప్ కౌర్ శుక్రవారం మీనజోలలో పర్యటించి అధికారులతో సమీక్షించారు. గతం బీజేడీ ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధికి రూ.40లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులు వినియోగించి పర్యాటకులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు పురాతన మందిరాన్ని అభివృద్ధి చేస్తామని సబ్ కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో గుణుపూర్ ఐటీడీఏ ఇంజినీర్ విశ్వేశ్వర మాఝి, ఆర్ఐ (చంద్రపూర్) నీలాంచల్ గౌడొ తదితరులు పాల్గొన్నారు.

సైనికుల త్యాగాలను స్మరిద్దాం



కార్గిల్ జవాన్ శివప్రసాద్ త్రిపాఠితో విద్యార్థులు

మల్కన్‌గిరి: సైనికుల త్యాగాలను గుర్తుంచుకోవాల్సిన బాధ్యత దేశ పౌరులపై ఉందని మల్కన్‌గిరి కాలేజీ ప్రిన్సిపాల్ లింగరాజ్ మిశ్రో అన్నారు. కళాశాలలో శుక్రవారం కార్గిల్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్కన్‌గిరికి చెందిన శివప్రసాద్ త్రిపాఠి అనే ఆర్మీజవాన్‌కు సన్మానించారు. ఈయన 1999లో కార్గిల్ యుద్ధం పాల్గొని దేశానికి సేవలందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కమాండర్ సశాంతోకుమార్ మిశ్రో, రిటైర్డ్ హెచ్‌ఎం ప్రకాష్‌చంద్రపట్నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ



బైక్‌ను చోరీ చేస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వద్ద శుక్రవారం తెల్లవారు జామున 4.30 గంటల ప్రాంతంలో ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. సదరు సమితి బొడాఖల్ గ్రామానికి చెందిన రెంగా మెలక తన బంధువులను పరామర్శించేందుకు రాయగడ వచ్చాడు. బైకును పార్కింగ్ స్థలంలో ఉంచాడు. ఉదయం 6 గంటలకు తిరిగి గ్రామానికి వెళ్లేందుకు బయటకు రాగా బైక్ కనిపించలేదు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఆస్పత్రికి చేరుకుని సీసీ కెమెరాలు పరిశీలించగా ఓ వ్యక్తి బైక్ చోరీ చేయడం గుర్తించాడు. నిందితుడి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

జలుమూరు: పాగోడు పంచాయతీ పరిధి వెలుసోద గ్రామానికి చెందిన గురువు త్రినాథరావు (61) పాము కాటుతో గురువారం సాయంత్రం మృతి చెందారు. బంధువులు తెలిపిన వివరాలు ప్రకారం .. రావిపాడు పంచాయతీ ఏనేటి కొత్తూరులో మధ్యాహ్నం పొలం పనికి వెళ్లిన త్రినాథరావు గడ్డి దుబ్బు తీస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే కుటుంబ సభ్యులు నరసన్నపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే ఆయన మృతి చెందాడు. త్రినాథరావుకు భార్య అప్పమ్మ, కొడుకు భార్గవరావు, కూతురు కల్యాణి ఉన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా లీగల్ సర్వీసెస్ కార్యదర్శి బిమల్ రవుళో

పర్లాకిమిడి: గజపతి జిల్లా న్యాయ సలహా సర్వీసుల ప్రాధికరణ అధ్యక్షుడు, జిల్లా జడ్జి ప్రణబ్‌కుమార్ రౌత్రాయ్ ఆదేశాల మేరకు గుమ్మా సమితి జీబ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం చట్టాలపై అవగాహన కల్పించారు. జిల్లా లీగల్ సర్వీసెస్ ప్రాధికరణ కార్యదర్శి బిమల్ రవుళో హాజరై కిశోరీ న్యాయచట్టం, విద్యా హక్కు ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో జిల్లా శిశు సంరక్షణ అధికారి అరుణ్‌కుమార్ త్రిపాఠి, జీబ పంచాయతీ సర్పంచ్ రవీంద్ర శోబోరో, పోలీసు అధికారి లక్ష్మణ్ బెసరా, మామంగళా సమితి సభ్యురాలు మమతారాణి శతపతి, హెచ్‌ఎం మీనాక్షి పాఢి తదతరులు పాల్గొన్నారు.

పలాస జీడి పరిశ్రమలో తనిఖీలు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో జీడి పరిశ్రమను జీఎస్టీ అధికారులు శుక్రవారం తనిఖీ చేయడంతో వ్యాపారులు పరుగులు పెట్టారు. పలాస పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో ఎక్స్‌లెంట్ క్యాజు సప్లయర్స్ పరిశ్రమ తనిఖీ కోసం గురువారం విజయనగరం నుంచి జీఎస్టీ అధికారులు వచ్చారు. ఆ సమయంలో నిర్వాహకురాలు సిందిరి శిరీష అందుబాటులో లేకపోవడంతో ఆ పరిశ్రమకు సీలు వే శారు. అక్కడితో ఆగకుండా యజమాని ఇంటి వద్దకు వెళ్లారు. కానీ ఇంటి వారు తలుపులు తీయలేదు. దీంతో జీఎస్టీ వెస్ట్ సర్కిల్ విజయనగరం అసిస్టెంట్ కమిషనర్ కింజరాపు వెంకటరమణ, జీఎస్టీఓ ఎం.రమేష్, డీసీటీఓ పలాస శ్వేతలు రెండు బృందాలుగా మరోసారి పరిశ్రమ వద్దకు చేరుకున్నారు. యజమాని శిరీష అందుబాటులో లేకపోవడంతో ఆమె భర్త సిందిరి శ్రీనివాసరావు హాజరయ్యారు. దీంతో సీలు తెరిచి లోపల నిల్వలు, రికార్డులు పరిశీలించారు.

కక్ష కట్టారు..

దీనిపై శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడు తూ వ్యాపారంలో అన్ని టాక్సులు కడుతున్నామని, అయినా తనకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రిటర్న్స్ రూ.13లక్షలు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారని తెలిపారు. అప్పట్లో పలాస సీటీఓ ఈ డబ్బు కావాలంటే రూ.4 లక్షలు లంచం ఇవ్వాలని అడిగారని ఆరోపించారు. దీంతో తాను జనవరిలో ఏసీబీని ఆశ్రయించానని, అప్పట్లో సీటీఓ కార్యాలయంలో వెంకట్ అనే అధికారిని పట్టుకున్నారని గుర్తు చేశారు. దీంతో జీఎస్టీ అధికారులు కక్ష గట్టి తన పరిశ్రమపై దాడులు చేశారని ఆరోపించారు. ఎలాంటి నోటీసులు లేకుండా సీలు వేశారని, 500కుపైగా పరిశ్రమలు ఉంటే తన వద్దకే వచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. తమలాంటి వారిని ప్రోత్సహించాలే తప్ప ఇలా వేధించకూడదని విజ్ఞప్తి చేశారు.

ముగిసిన రైల్వే అర్బన్ బ్యాంకు ఎన్నికలు

- విజేతగా శ్రామిక్ యూనియన్
- ఉనికి చాటుకున్న ఏఐఎల్ ఆర్‌ఎస్‌ఏ



సంబల్‌పూర్‌లో శ్రామిక్ యూనియన్ విజయోత్సాహం



ఖుర్దారోడ్ రన్నింగ్ శాఖ విజేతల అభినందన సభ



విజేతగా నిలిచిన తెలుగు అభ్యర్థి జి.మంగరాజుకు అభినందన

భువనేశ్వర్: అవిభాజిత ఆగ్నేయ రైల్వే సిబ్బంది సహకార సంస్థ (అర్బన్ బ్యాంకు) ఎన్నికలు విజయవంతంగా ముగిశాయి. రెండు విడతల్లో జరిగిన పోలింగు తరహాలోనే ఓట్లు లెక్కింపు రెండు విడతల్లో జరిగింది. ఈ ప్రక్రియ శుక్రవారం సాయంత్రంతో పూర్తయ్యింది. రైల్వే శాఖ గుర్తింపు పొందిన తూర్పు కోస్తా రైల్వే జోన్‌లో శ్రామిక్ యూనియన్ విజేతగా నిలిచింది. శ్రామిక్ కాంగ్రెసు ధీటైన పోటీతో రెండో స్థానం చేజిక్కించుకుంది. అఖిల భారత లోకో రన్నింగ్ సిబ్బంది సంఘం ఈ పోటీల్లో తన ఉనికిని చాటుకుంది. జోన్ వ్యాప్తంగా 211 నియోజక వర్గాలుగా పోలింగ్ నిర్వహించారు. ఖుర్దారోడ్, వాల్తేరు, సంబలపూర్ మండలాలతో మంచేశ్వర్ వర్కు షాపు, జోనల్ రైల్వే ప్రధాన కార్యాలయాల పరిధిలో ఎన్నికలు జరిగాయి.

- సంబలపూర్ మండలంలో 29 స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. వీటిలో తూర్పు కోస్తా రైల్వే శ్రామిక్ యూనియన్ అత్యధికంగా 16 స్థానాల్లో గెలుపొందగా శ్రామిక్ కాంగ్రెసు 7, ఎల్‌ఆర్‌ఎస్‌ఏ 4, అఖిల భారత గార్డ్స్ మండలి (ఏఐజీసీ) 2 స్థానాల్లో విజయం సాధించింది.
- అఖిల భారత లోకో రన్నింగ్ సిబ్బంది సంఘం (ఏఐఎల్‌ఆర్‌ఎస్‌ఏ) జోన్ వ్యాప్తంగా 28 స్థానాల్లో పోటీ చేసి 18 స్థానాలు (64 శాతం) కైవసం చేసుకుందని సంఘం ఖుర్దారోడ్ మండల కార్యదర్శి సి. ఆర్.పతి తెలిపారు. ఐదేళ్లకోసారి క్రమం తప్పకుండా జరగాల్సిన అవిభాజిత ఆగ్నేయ రైల్వే సిబ్బంది సహకార సంస్థ (అర్బన్ బ్యాంకు) ఎన్నికలు 9 ఏళ్ల దీర్ఘకాలం తర్వాత విజయవంతంగా జరగడం పట్ల సర్వత్రా ఆనందం వ్యక్తమైంది. ఈ ఎన్నికలతో వాటాదారులకు లాభాంశాల విడుదల వివాదం కొలిక్కి వచ్చి మరిన్ని సేవలు అందుబాటులోకి వస్తాయని విజేతవర్గం పేర్కొంది.

బంగారు భవితకు నవోదయం

- 6వ తరగతి ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల
- ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులకు అవకాశం
- దరఖాస్తు చేసేందుకు సెప్టెంబర్ 16 వరకు చాన్స్
- వచ్చే ఏడాది జనవరి 18న ప్రవేశ పరీక్ష
- ప్రణాళికతో సిద్ధమైతే సీటు గ్యారెంటీ



స్మార్ట్ బోధన.. ఆన్‌లైన్ పాఠాల్లో నిమగ్నమైన విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జవహర్ నవోదయలో 2025-26 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. గ్రామీణ విద్యార్థులకు ఈ విద్యాలయాల్లో చోటు లభిస్తే బంగారు భవితకు దారి దొరికినట్టే. ఇక్కడ 6 నుంచి 12 వ తరగతి వరకు సీబీఎస్ఈ విద్యతో పాటు హాస్టల్ వసతి సౌకర్యం కల్పిస్తారు. జిల్లాకు సంబంధించి సరుబుజ్జిలి మండల పరిధిలోని వెన్నెలవలసలో జవహర్ నవోదయ విద్యాలయం ఉంది. ఆరో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది.

ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు

2025-26 ఏడాదికి సంబంధించి ప్రవేశ పరీక్ష నిర్వహణకు అధికారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. http:navodaya.gov.in, http://cbreitmr.rci. gov.in/nvr వెబ్‌సైట్‌లలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కేవలం ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్న దరఖాస్తులను మాత్రమే అనుమతిస్తారు. దీనికి ఆఫ్‌లైన్ విధానం లేదు. దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబర్ 16వ తేదీ వరకు గడువు విధించారు. వచ్చే ఏడాది అంటే 2025 జనవరి 18న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ప్రాతిపదికగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

5వ తరగతి చదువుతున్నవారు అర్హులు..

జేఎన్‌వీల్లో 6వ తరగతిలో 80 సీట్లు ఉండగా, 75 సీట్లు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి కేటాయిస్తారు. ఐదు సీట్లు పట్టణ ప్రాంతాల విద్యార్థులకు ఇస్తారు. జిల్లా జనాభా ప్రాతిపదికన ఎస్టీలకు 15 శాతం, ఎస్సీలకు 7.5 శాతం, బాలికలకు 1/3 శాతం, విభిన్న ప్రతిభావంతుల(దివ్యాంగులు)కు 3 శాతం రిజర్వేషన్ కల్పిస్తారు. గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వరుసగా 3, 4 తరగతి చదివి, ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న బాలబాలికలు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. అలాగే విద్యార్థులు 2020-25 విద్యా సంవత్సరంలో 5వ తరగతి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో చదువుతూ 2013 మే ఒకటి నుంచి 2015 జూలై 31వ తేదీ మధ్యలో జన్మించి ఉండాలి.

వసతులు, సౌకర్యాల కల్పన భేష్

సరుబుజ్జిలి మండలం వెన్నెలవలసలోని జవహర్ నవోదయ విద్యాలయంలో అన్ని వసతులు, సౌకర్యాలు మెండుగా ఉన్నాయి. ఉత్తమ బోధన అందిస్తున్నారు. విద్యాలయంలో తరగతులకు అకడమిక్ బ్లాక్, పాలనా సౌలభ్యానికి అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, బాలబాలికలకు వేర్వేరుగా డార్మిటరీలు, భోజన శాలలు, బోధకులు, సిబ్బందికి ప్రత్యేక క్వార్టర్స్‌ను నిర్మించారు. విద్యాలయం ఆవరణలో క్రీడల కోసం ప్రత్యేకంగా మైదానాన్ని తీర్చిదిద్దారు. ఆటపాటలు, యోగా వంటివి నిర్వహిస్తుంటారు. విద్యార్థుల కోసం వ్యాయామ శాలలు ఉన్నాయి. స్మార్ట్ తరగతులు కొనసాగిస్తున్నారు. సైన్సు, కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయం వంటి సౌకర్యాలు ఉన్నాయి.

ప్రణాళికాబద్ధంగా చదవాలి..

6వ తరగతిలో 80 సీట్లను నింపుతారు. ఇందుకు ప్రవేశ పరీక్ష నిర్వహించి మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు. కేంద్ర జాతీయ విద్యా విధానాన్ని అనుసరించి 1986లో జవహర్ నవోదయ విద్యాలయాలు స్థాపించింది. 6వ తరగతి మొదలుకుని 12వ తరగతి వరకు తరగతులు కొనసాగిస్తారు. ఏడు ప్రాంతీయ భాషల్లో, మాతృభాషల్లో బోధన జరుగుతుంది. ముఖ్యంగా మాథ్స్, సైన్స్ పాఠ్యాంశాలను ఆంగ్లంలో, సామాజిక శాస్త్రాలు హిందీలో బోధిస్తారు. పదోతరగతి వరకు సెంట్రల్‌బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ)ను అమలు చేస్తారు. సమయం కేటాయించి ప్రణాళికాబద్ధంగా చదివితే సీటు సాధించవచ్చని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. మాథ్స్, సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులపై 5వ తరగతి వరకు పాఠాలపై పూర్తిగా అవగాహన పెంచుకుని, పూర్వపు జేఎన్‌వీ పరీక్ష పేపర్లను, పాత మోడల్ పేపర్లను పూర్తిగా సన్నద్ధం చేయగలిగితే మంచి మార్కుల సాధనకు అవకాశం ఉంటుందని నిష్ణాతులు చెబుతున్నారు.

పలాసపురంలో అగ్ని ప్రమాదం



అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న పశువుల శాల

సోంపేట: మండలంలోని పలాసపురం గ్రామంలో శుక్రవారం ఉదయం 6 గంటల ప్రాంతంతో అగ్ని ప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన సంకరామారావు, బడ్డి బైరాగికి చెందిన రెండు రేకు ఇళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో పాటు రెండు పశువుల శాలలు పూర్తిగా కాలిపోయాయి. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. సోంపేట అగ్నిమాపక సిబ్బంది వెంటనే చేరుకుని మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. పలాసపురం సర్పంచ్ తడక జోగారావు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రభుత్వం బాధితులకు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని కోరారు.

శ్రీముఖలింగేశ్వరుని హుండీ ఆదాయం లెక్కింపు వాయిదా

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగేశ్వర దేవాలయం హుండీ ఆదాయం లెక్కింపు వాయిదా పడిందని ఈఓ పి.ప్రభాకరరావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 30న దేవాలయ ఆవరణలో దేవదాయ శాఖ సిబ్బంది, అర్చకులు, గ్రామ పెద్దల సమక్షంలో లెక్కించనున్నామని ఈఓ తెలిపారు. ఆసక్తి గల భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

ఎంపీడీవోపై ప్రాథమిక విచారణ



ఎంపీడీవో రమామణిని ప్రాథమిక విచారణ చేస్తున్న విజిలెన్స్ అధికారి వెంకటరమణ

రామభద్రపురం: గత ఎంపీడీవో రమామణి మండలంలో అవినీతి, అక్రమాలకు ప్పాల్పడ్డారని, ఫీల్డ్‌లో తిరగకుండానే తిరిగినట్లు బిల్లులు డ్రా చేసినట్లు మిర్తివలసకు చెందిన గిరడ బాస్కరరావు లోకాయుక్త కమిషనర్, విజిలెన్స్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీడీవోను ప్రాథమిక విచారణ చేయాలన్న కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఉపాధిహామీ జిల్లా విజిలెన్స్ అధికారి వెంకటరమణ ఎంపీడీఓను ప్రాథమిక విచారణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక విచారణ నివేదికను కలెక్టర్‌కు పంపిస్తానని తెలిపారు.

డిప్లమో పారామెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం రూరల్: ఏపీ స్టేట్ అండ్ హెల్త్‌కేర్ కౌన్సిల్ సెక్రటరీ డిప్లమో పారామెడికల్ కోర్సులకు కన్వీనర్ కోటాలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆగస్టు 6వ తేదీ వరకు ప్రవేశాలకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కోర్సులకు ఇంటర్ ఏ గ్రూప్ పాసైన వారైనా అర్హులేనన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. తమ కళాశాలలో మేనేజ్‌మెంట్, కన్వీనర్ కోటాలో అందుబాటులో సీట్లు ఉన్నాయని ఆసక్తి గల వారు తగు ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 7995013422, 7680945357 నంబర్లను సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భోగాపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన డెంకాడ మండలం మోదవలస గ్రామానికి చెందిన పైడిశెట్టి అప్పలనాయుడు(33) విజయనగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ రవికుమార్ తెలిపారు. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మోదవలస గ్రామానికి చెందిన పైడిశెట్టి అప్పలనాయుడు నాతవలస టోల్‌ప్లాజాలో పనిచేస్తూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 25న తన బైక్‌పై డ్యూటీకి వెళ్తుండగా మార్గమధ్యంలో సుందరపేట జాతీయ రహదారి వద్దకు చేరుకునేసరికి ముందు వెళ్తున్న లగేజీ ఆటోను ఢీకొని తీవ్ర గాయలపాలయ్యాడు. స్థానికుల సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి క్షతగాత్రుడిని విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుని సోదరుడు ఈశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రవికుమార్ తెలిపారు.

బొలెరో బోల్తా పడి వ్యక్తి మృతి

దత్తిరాజేరు: మండలంలోని మరడాం గ్రామ సమీపంలో బుచ్చన్న చెరువు వద్ద జాతీయ రహదారిపై బొలెరో వాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో డ్రైవర్ లగడాల పైడిపి నాయుడు(35)మృతి చెందినట్లు ఎస్ బూర్జవలస ఎస్సై లక్ష్మీప్రసన్నకుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తెలిపిన వివరాల మేరకు రామభద్రపురం నుంచి గజపతినగరం వైపు వస్తున్న బొలెరో వాహనం మరడాం వద్దకు వచ్చే సరికి అదుపు తప్పి బోల్తా పడడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు అవడంతో గజపతినగరం సామాజిక ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అదే వాహనంలో పనిచేస్తున్న గ్రామానికి చెందిన క్లీనర్ శివకుమార్‌కు గాయాలవడంతో గజపతినగరం సామాజిక ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలించారు.

28న బీచ్ కబడ్డీ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న బీచ్ కబడ్డీ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 28న నిర్వహించనున్నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.వి.ప్రభావతి, ఎ.రంగారావుదొర శుక్రవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు నెల్లిమర్ల మండల సారిపల్లి దిబ్బేశ్వర ఆలయం ప్రాంగణం సమీపంలోని చంపావతి నదీ తీరంలో ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. స్త్రీ, పురుషుల విభాగాల్లో జరిగే ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు వచ్చేనెల 2 నుంచి 4వ తేదీ వరకు నెల్లూరు జిల్లా ఇందుకూరిపేటలో జరగబోయే 11వ అంతర్ జిల్లాల బీచ్ కబడ్డీ పోటీల్లో విజయనగరం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే పురుష క్రీడాకారులు 85 కేజీల లోపు, స్త్రీలు 75 కేజీల లోపు బరువు కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనాలన్నారు. మరిన్ని వివరాలకు అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపేన లక్ష్మణరావు సెల్: 99497 21949 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కొత్త పింఛన్లు మరి లేవా?

- జిల్లాలో నూతనంగా వితంతువులు, దివ్యాంగుల నమోదు
- వారికి ఇంతవరకూ ఫించన్ మంజూరు చేయని సర్కారు
- గతంలో ప్రతి ఆరునెలలకు కొత్త పింఛన్ల మంజూరు
- కొత్త ప్రభుత్వం రాకతో పింఛన్ల మంజూరులో జాప్యం
- ఊసే లేని 50 ఏళ్లు దాటినవారికి పింఛన్ పథకం
- ఆందోళనలో కొత్త లబ్ధిదారులు
- జిల్లా వ్యాప్తంగా కొత్తగా 20 వేలకు పైగా దరఖాస్తులు



“ఈ ఫొటోలోని మహిళ పేరు బింగి హైమావతి. రాజాం మండలంలోని పెనుబాక గ్రామంలో నివసిస్తోంది. భర్త రమణ చనిపోయి ఆరు నెలలు కావస్తోంది. ఆమె వితంతు పింఛన్‌కు అర్హురాలు. గ్రామ సచివాలయంలో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంది. ఎన్నికల కోడ్ అనంతరం పింఛన్ వస్తుందని ఆశపడింది. అయితే ఇప్పటికీ ఈమెకు పింఛన్ మంజూరు కాలేదు. గతంలో ఆమె భర్త చిన్నపాటి కిరాణా వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు. ఆయన మరణానంతరం ఈ కుటుంబాన్ని ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. ఈ తరుణంలో పింఛన్ నగదు ఆర్థిక భరోసా కల్పిస్తుందని ఆశించగా, ఇంతవరకూ ఆమెకు ఫించన్ అందలేదు.”





“ఈ ఫొటోలోని దివ్యాంగుడి పేరు బండి లక్ష్మణరావు. స్వగ్రామం రాజాం మండలంలోని పెనుబాక. ఏడు నెలల క్రితం వరకూ విజయవాడలో కూలి పనిచేస్తూ ఇంటికి పెద్ద దిక్కుగా ఉండేవాడు. ఆకస్మికంగా పక్షవాతం రావడంతో కుడికాలు, కుడిచేయి పనిచేయకుండా పడిపోయాయి. ఐదునెలల క్రితం ఆయనకు రాజాం ఏరియా ఆస్పత్రిలో సదరం సర్టిఫికెట్ కూడా ఇచ్చారు. పింఛన్‌కు దరఖాస్తు చేసుకునే నిమిత్తం గ్రామ సచివాలయానికి వెళ్లాడు. నాలుగో నెల నుంచి ఇంతవరకూ ఈయన పింఛన్ దరఖాస్తు ఆన్‌లైన్ కాలేదు. కొత్త పింఛన్ వస్తుంది, ఆ నగదు ఇంటికి సాయంగా ఉంటుంది, తనకు నెలవారీ ఖర్చులు, మందులకు పనికొస్తాయని అనుకుంటే ఇంతవరకూ పింఛన్ రాకపోవడంతో ఆందోళన వ్యక్తంచేస్తున్నాడు.”



“ఈ ఫొటోలోని వ్యక్తి పేరు తాడ్డి లక్ష్మునాయుడు, రాజాం మండలంలోని లక్ష్మీపురం గ్రామం. ఈయనకు జనవరి-2024తో 60 ఏళ్లు దాటాయి. పింఛన్ కోసం గ్రామ సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకున్నాడు. జూన్ నెలలో పింఛన్ మంజూరు కావాల్సి ఉంది. ఇప్పుడు ఈ పింఛన్ దరఖాస్తు ఆచూకీ లేదు. కొత్త పింఛన్ మంజూరు చేసే అంశం కనీసం తమకు తెలియదని, ఎప్పుడు కొత్త పింఛన్లు ఇస్తారో తెలియదని సచివాలయ ఉద్యోగులు తెగేసి చెప్పారు. గతంలో గ్రామ వలంటీర్లే లబ్ధిదారుల ఇళ్లకు వచ్చి పింఛన్ దరఖాస్తులు తీసుకుని, సకాలంలో పింఛన్ ఇచ్చేవారని, ఇప్పుడీ ప్రభుత్వం ఎందుకిలా వ్యవహరిస్తోందంటూ మదనపడుతున్నాడు. 60 సంవత్సరాలు దాటినా పింఛన్ రాకపోడంతో ఆవేదన చెందుతున్నాడు.”

రాజాం: గత ప్రభుత్వ నిబంధనల ప్రకారం 60 సంవత్సరాలు దాటిన వయో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, సింగిల్ ఉమన్, తలసీమియా, డయాలసిస్ తదితర విభాగాలకు చెందిన పింఛన్ లబ్ధిదారులు 20వేల మంది వరకూ జిల్లాలో ఉన్నారు. కొత్తగా వీరందరికీ పింఛన్ వర్తించే అర్హత వచ్చింది. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం వారికి ఎటువంటి ప్రకటన చేయకపోవడంతో వారంతా తమ పింఛన్ ఆశలు గాలిలో పెట్టుకున్నారు. ప్రధానంగా తలసీమియా, డయాలసిస్ పేషెంట్ల కుటుంబాలకు ఆర్థిక ఇబ్బందులు చాలా ఎక్కువయ్యాయి. వారికి పింఛన్ ఇచ్చి ఉంటే కొంత మేర ఆర్థిక సమస్యలు తగ్గేవి. గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో ఉమ్మడి విజయనగరం జిల్లాలో 1,21,870 మంది లబ్ధిదారులు పింఛన్ పొందేవారు. అంతకుముందు జన్మభూమి కమిటీలు అర్హత ఉన్నా చాలా మందికి పింఛన్ ఇవ్వకుండా అడ్డుకున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఆరు నెలలకు స్పెషల్ డ్రైవ్ పెట్టి, గ్రామ సచివాలయాల ద్వారా పింఛన్ మంజూరుచేసింది. ఐదేళ్లలో 1.60 లక్షల కొత్త పింఛన్లు పెరిగాయి. ప్రస్తుతం జిల్లాలో 2,81,713 మంది లబ్ధిదారులు పింఛన్ పొందుతున్నారు.

50 ఏళ్లు దాటినవారి ఊసే లేదు..

అర్హత ఉన్న వితంతువులు, దివ్యాంగులకే ఫించన్ రాకుంటే కొత్తగా 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్ ఇస్తామని ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీపై లబ్ధిదారులు పెదవి విరుస్తున్నారు. 50 ఏళ్లు దాటిన బీసీలకు పింఛన్ ఇస్తే ప్రతి నియోజకవర్గంలో సగటున 12 వేల మంది లబ్ధిదారులు అర్హత పొందుతారు. జిల్లా వ్యాప్తంగా కొత్తగా 84 వేల మందికి పింఛన్లు అందించాలి. అవి కూడా నెలకు రూ.4 వేలు చొప్పున. ఇంత పెద్ద ఎత్తున పింఛన్ చెల్లించాలంటే ప్రభుత్వానికి కష్టతరంగా మారనున్న నేపథ్యంలో ఉన్న పింఛన్లలో కోత విధించడమో? లేక ఏదో మతలబు పెట్టి పింఛన్ల అర్హత నిబంధనలు ఎక్కువ చేసి లబ్ధిదారుల సంఖ్యను తగ్గించే ప్రయత్నమో ప్రభుత్వం చేసే ప్రమాదం ఉందని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

కొత్త పింఛన్ల విధివిధానాలు రాలేదు

“కొత్త పింఛన్లకు సంబంధించి ఇంతవరకూ విధివిధానాలు రాలేదు. అవి వచ్చిన తరువాత దరఖాస్తులు తీసుకుంటాం. గతంలో మాదిరిగా అర్హత ఉన్న వితంతువులు, దివ్యాంగులు, 60 ఏళ్లు దాటిన వయో వృద్ధుల పింఛన్ల దరఖాస్తులు ప్రస్తుతం తీసుకోవడం లేదు.

వి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ, రాజాం

క్షయ నియంత్రణ విభాగంలో పోస్టుల భర్తీ

- ఐదు పోస్టులకు నియామకం
- ఆగస్టు 1వ తేదీ లోగా దరఖాస్తు అందజేయాలి

పార్వతీపురం టౌన్: జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా క్షయ విభాగంలో ఐదు పోస్టులను భర్తీ చేసేందుకు రీ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డా.కె.రాణి వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైద్యాధికారి, జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్, డాట్స్ ప్లస్ టీబీ-హెచ్‌ఐవీ సూపర్‌వైజర్, పీపీఎం కోఆర్డినేటర్, అకౌంటెంట్ ఉద్యోగాల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో అభ్యర్థుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోస్టుల కోసం దరఖాస్తు చేసే అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆగస్టు 1వ తేదీలోగా విజయనగరంలోని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కార్యాలయం ఆవరణలో ఉన్న జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఈ పోస్టుల భర్తీ కోసం గత ఏడాది సెప్టెంబరులో నోటిఫికేషన్ జారీచేయడం జరిగిందని, సార్వత్రిక ఎన్నికల కారణంగా పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తికాలేదని, అందువల్ల ఈపోస్టుల భర్తీకి సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న కలెక్టర్, విజయనగరం వారి ఆదేశాల మేరకు తాజాగా నోటిఫికేషన్ జారీచేస్తున్నట్టు తెలిపారు. ఆయా పోస్టులకు కావలసిన అర్హతలు, జీతం, ఇతర సమాచారం కోసం జిల్లా వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. విజయనగరం.ఎన్ఐసీ.ఇన్ పరిశీలించవచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు పార్వతీపురం మన్యం జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి కార్యాలయంలో పనిచేయవలసి ఉంటుందని పేర్కొన్నారు. ఏడాది కాలంపాటు పనిచేసేందుకు ఈ నియామకం చేపడుతున్నట్లు వివరించారు.

ఎంఎల్ఎస్ గోదాం పరిశీలన

- సాక్షి కథనానికి స్పందన



ఎంఎల్ఎస్ గోదాం వద్ద వివరాలు సేకరిస్తున్న తహసీల్దార్ ఎస్‌కే రాజు తదితరులు

రాజాం: పట్టణంలోని సివిల్ సప్‌లెస్లై మండల లెవెల్ స్టాక్ పాయింట్‌ను తహసీల్దార్ ఎస్‌కే రాజు, సివిల్ సప్‌లెస్లై డీటీ చిరంజీవులు శుక్రవారం పరిశీలించారు. ఈనెల 25న 'బస్తాకు రెండు కిలోలు నొక్కేద్దాం' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో పాటు సివిల్ సప్‌లెస్లై డీఎం ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించడంతో అధికారులతో కలిసి తహసీల్దార్ కేంద్రానికి చేరుకున్నారు. అక్కడికి ఎఫ్‌సీఐ గోదాంనుంచి వస్తున్న బియ్యం బస్తాలను పరిశీలించారు. వాటిని తూకం వేయించారు. గోదాం ఇన్‌చార్జ్ ఆర్.భవానితో పాటు కలాసీల వద్ద వివరాలు సేకరించారు. కొంతమంది డీలర్లను పిలిపించి ఆరాతీశారు. తమకు గత నెల వరకూ రేషన్ బియ్యం తక్కువే ఇచ్చారని డీలర్లు అధికారులకు తెలిపారు. అనంతరం అక్కడి నుంచి ఎఫ్‌సీఐ గోదాంకు వెళ్లి అక్కడ ఇన్‌చార్జ్ గా ఉన్న వాసు వద్ద వివరాలు సేకరించారు. ఎఫ్‌సీఐ గోదాం నుంచి ఎంఎల్ఎస్ పాయింట్‌కు 50 కిలోల బస్తాకు అదనంగా 580 గ్రాముల బియ్యాన్ని లెక్క కట్టి ఇస్తున్నామని ఆయన వివరించారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన ఎంఎల్ఎస్ కేంద్రం ఇన్‌చార్జ్ భవాని తమకు సక్రమంగా ఎఫ్‌సీఐ గోదాంనుంచి బియ్యం రావడంలేదని అధికారులకు ఫిర్యాదుచేశారు. ఈ విషయం ముందుగానే చెప్పాలని, భవిష్యత్‌లో ఇటువంటి తేడాలు లేకుండా చూసుకోవాలని సివిల్ సప్‌లెస్లై గోదాం ఇన్‌చార్జ్‌ను తహసీల్దార్ ఆదేశించారు. ఎంఎల్ఎస్ కేంద్రం వద్ద తూకం వేసి డీలర్లకు బియ్యం అందజేయాలని సూచించారు. అనంతరం విలేకరులతో తహసీల్దార్ మాట్లాడుతూ సాక్షిలో వచ్చిన కథనం ప్రకారం దర్యాప్తు చేశామని, నివేదికలు కలెక్టర్‌తో పాటు సివిల్ సప్‌లెస్లై డీఎంకు అందజేస్తామన్నారు.

స్వార్థం ఎరుగని దేశభక్తులు సైనికులు



కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న సైనికులతో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: సైనికులంటే స్వార్థం ఎరుగని దేశభక్తులని, వీర సైనికుల త్యాగాలు మరువలేనివని జిల్లా సైనిక సంక్షేమ అధికారి డాక్టర్ సత్యప్రసాద్ పేర్కొన్నారు. సైనికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కార్గిల్ విజయ్ దివాస్‌ను స్థానిక గాజులరేగలోని మాజీ సైనికుల కాలనీలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాకిస్థాన్‌తో కార్గిల్ వద్ద 1999లో జరిగిన యుద్ధంలో భారత్ విజయానికి ప్రతీకగా ఏటా జూలై 26న కార్గిల్ విజయ్ దివాస్ జరుపుకుంటున్నట్టు పేర్కొన్నారు. 17 వేల అడుగుల ఎత్తులోని కొండలపై జరిగిన యుద్ధంలో 30 వేల మంది సైనికులు పాల్గొన్నారని, 527 మంది వీర మరణం పొందారని తెలిపారు. విజయనగరం జిల్లా నుంచి 15 మంది సైనికులు కార్గిల్ యుద్ధంలో ప్రత్యక్షంగా పాల్గొనడం గొప్ప విషయమని పేర్కొన్నారు. జిల్లాలో 3,410 మంది మాజీ సైనికులు ఉన్నారని, 20 వేల సైనికుల కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న జిల్లాకు చెందిన 14 మంది సైనికులు, వీరమాతలను శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సైనికుల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటరావు, అధ్యక్షుడు ఈశ్వరరావు, ఇతర సభ్యులు, డివిజినల్ పీఆర్ఓ జానకమ్మ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కలిసి అసోసియేషన్ సభ్యులు వారి పెండింగ్ డిమాండ్లతో వినతి పత్రాన్ని సమర్పించారు.

నేడు డ్రగ్స్ నియంత్రణపై సమావేశం


- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేసలి అప్పారావు



విజయనగరం: రాష్ట్రంలో ఇటీవల బాలలపై జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలకు కారణమైన డ్రగ్స్ నియంత్రణలో భాగంగా విజయనగరం జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలకు చెందిన కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో ఈ నెల 27న సమావేశం నిర్వహిస్తామని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేసలి అప్పారావు శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు విజయనగరం జిల్లా కేంద్రంలోని అపెక్స్ జూనియర్ కళాశాలలో జరిగే సమావేశంలో కళాశాల విద్యార్థులు డ్రగ్స్ వినియోగానికి అలవాటు పడితే కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తారన్నారు. ఆయా కళాశాలల్లో డ్రగ్స్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేస్తారని పేర్కొన్నారు. రీజనల్ ఇంటర్మీడియట్ సమన్వయ అధికారి మజ్జి ఆదినారాయణ ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్ విధిగా హాజరుకావాలని సూచించారు.

పెరుగుతున్న మడ్డువలస నీటి మట్టం

- నాలుగు గేట్లు ఎత్తి 6,210 క్యూసెక్కుల నీరు విడుదల



వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు వద్ద శుక్రవారం నీటిమట్టం గణనీయంగా పెరిగింది. వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో వేగావతి, సువర్ణముఖి నదుల నుంచి 5,600 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు వద్ద 64.25 మీటర్లు లెవెల్ నీటిమట్టం నమోదైంది. దీంతో ప్రాజెక్టు వద్ద నాలుగు గేట్లు ఎత్తి 6,210 క్యూసెక్కుల నీటిని కిందకు విడిచిపెడుతున్నట్టు ఏఈ నితిన్ తెలిపారు.

ఎంపీఎఫ్‌సీ గోదాములను వినియోగంలోకి తేవాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ఎంపీఎఫ్‌సీ గోదాములను రెండు వారాల్లో వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి ఇంప్లిమెంటేషన్ కమిటీ (డీఎల్ఐసీ) సమావేశం శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో జరిగింది. వ్యవసాయ మౌలిక వసతుల కల్పన కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఎంపీఎఫ్‌సీ (మల్టీపర్పస్ ఫెసిలిటేటింగ్ సెంటర్స్) గోదాముల పరిస్థితి, పెండింగ్ బిల్లులపై సమావేశంలో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో మొత్తం 44 ఎంపీఎఫ్‌సీ గోదాముల నిర్మాణాన్ని చేపట్టగా వీటిలో ఇప్పటి వరకు 23 భవనాల నిర్మాణాన్ని పూర్తి చేశామని ఇన్‌చార్జి సహకార అధికారి ఎస్.రామ్మూర్తి తెలిపారు. ఒక్కో భవనం రూ.40 లక్షల వ్యయంతో నిర్మించగా దీనిలో 90 శాతం నాబార్డు రుణం కాగా, మిగిలిన 10 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని వివరించారు. మొత్తం 41 గోదాములను ఒక్కొక్కటి సుమారు 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతోను, గుషిణి, తమ్మాపురం, వేపాడ-2 గోదాములను మాత్రం 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మిస్తున్నట్టు వెల్లడించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే నిర్మాణం పూర్తయిన 23 భవనాలను ప్రజలకు ఉపయోగపడేవిధంగా వెంటనే వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్‌ను ఆదేశించారు. ఈ ప్రక్రియను రెండు వారాల్లో పూర్తి చేయాలని చెప్పారు. నిర్మాణంలో ఉన్న భవనాలకు నిర్ణీత గడువు విధించి పూర్తి చేయించాలని సూచించారు. పెండింగ్ బిల్లుల మంజూరుకు కలెక్టర్ ఆమోదం తెలిపారు. సమావేశంలో వ్యవసాయశాఖ జేడీ వీటీ రామారావు, ఉద్యాన శాఖ డీడీ జమదగ్ని, నాబార్డు డీడీఎం నాగార్జున, డీసీసీబీ సీఈఓ సీహెచ్ ఉమామహేశ్వరరావు, మార్కెట్ ఏడీ బి.రవికిరణ్, పీఏసీఎస్ సీఈఓలు, సహకార శాఖ అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో విజ్ఞాన వికాస కేంద్రాలు

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



విజ్ఞాన వికాస కేంద్ర సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో గ్రామ విజ్ఞాన వికాస కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పార్వతీపురంలోని చర్చి వీధిలో పట్టణ విజ్ఞాన వికాస కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ విభాగాలు, ఇతర సంస్థల ద్వారా నిర్వహించే వివిధ పోటీ పరీక్షలకు పుస్తకాలను అందించడం ఈ కేంద్రాల లక్ష్యమన్నారు. కేంద్రాలలో ఇంటర్నెట్, ఉద్యోగ నోటిఫికేషన్లు, దరఖాస్తు కోసం ఆన్‌లైన్ ప్రక్రియ, మెటీరియల్ డౌన్‌లోడ్ చేయడం, పోటీ పరీక్షల మ్యాగజైన్‌లు, దినపత్రికలు మొదలైన సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. వికాస కేంద్రాలు ఉదయం 8గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉంటాయన్నారు. పట్టణ ప్రాంతాల్లోనూ వికాస కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, ఉద్యోగార్థుల కోసం జిల్లా యంత్రాంగం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. అభ్యర్థులు కేంద్రాలను సొంత కేంద్రాలుగా పరిగణించాలన్నారు. కేంద్రాలను మరింత మెరుగ్గా నడిపేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసుకోవాలని వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు. కేంద్రాలను ఉదయం 8 గంటలకు తెరవడం నుంచి అన్ని సౌకర్యాలు పర్యవేక్షణ చేయాలని కోరారు. కేంద్రంలో సౌకర్యాలు కల్పించేందుకు స్పాన్సర్లు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, కమిషనర్ కె.శ్రీనివాస్, జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా నోడల్ అధికారి కె రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో చెస్ పోటీలు



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

విజయనగరం: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ పిలుపు మేరకు వాసవీ క్లబ్ శుక్రవారం స్థానిక ఆర్యవైశ్య సంఘం కార్యాలయంలో నిర్వహించిన చెస్ పోటీలకు స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి క్లబ్ జిల్లా గవర్నర్ ఆత్మకూరి సాంబమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాస్థాయిలో జరిగిన ఈ పోటీల్లో విజేతలను తిరుచ్చిలో ఆగస్టు 10,11 తేదీల్లో జరగబోయే జాతీయ స్థాయిలో ఫైనల్స్‌కు పంపిస్తామన్నారు. చెస్ పోటీలకు కట్టమూరి భాస్కరావు మూర్తి జడ్జిగా వ్యవహరించారు. వాసవీ క్లబ్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చెన్నా బుచ్చి జనార్ధనరావు, కార్యదర్శి కట్టమూరి రత్నారావు, కోశాధికారి విజ్జపు విజయ్ కుమార్, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ గుంపిన నారాయణరావు, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ బి.బంగారు బాబు, మాచర్ల చంద్రశేఖర్, రీజియన్ సెక్రటరీ సముద్రాల నాగరాజు, ఏవీఎస్.కుమార్, తదితరులు పాల్గొన్నారు.

యంత్రాలతో సాగు ప్రయోజనకరం

- జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు తదితరులు

డెంకాడ: రైతులు యంత్రాలతో పంటల సాగు చేయడం వల్ల ఖర్చు తగ్గడంతో పాటు పంట దిగుబడి కూడా వస్తుందని జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు అన్నారు. ఈ మేరకు డెంకాడ మండలంలోని సింగవరం గ్రామానికి చెందిన పిట్టా శ్రీనివాసరావు పొలంలో యంత్రం ద్వారా వరి నాట్లు వేసే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మాట్లాడారు. సంప్రదాయ పద్ధతుల్లో వరి పంట ఉబాలు చేయడం వల్ల ఒక చదరపు మీటర్‌కు 24 కుదుళ్లు ఉంటాయని, అదే యంత్రంతో ఉబాలు చేసిన చోట 33 కుదుళ్లు ఉంటాయని, దీంతో ఎకరాకి 6 నుంచి 7 బస్తాలు అధిక దిగుబడి వస్తుందని చెప్పారు. కూలీల ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. యంత్రంతో క్రమ పద్ధతిలో వరినాట్లు ఉండడం వల్ల దోమపోటు ఉధృతి చాలా వరకూ తగ్గుతుందన్నారు. పంటకు పురుగు, తెగుళ్లు వంటి వాటివి ఆశించినప్పుడు సులువుగా గుర్తించవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ ఎ.నాగభూషణం, ఏవో పి.నిర్మల, ఏఈవో బి.రామకోటి, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి విద్యుత్ షాక్

- ఆర్థిక సాయం కోసం ఎదురుచూపులు



తీవ్రగాయాలతో ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న ఫణిధర్

పాలకొండ రూరల్: మండలంలోని గొట్ట మంగళాపురం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి కోరాడ ఫణిధర్ గురువారం రాత్రి తన ఇంటి వద్ద విద్యుదాఘాతానికి గురయ్యారు. సొంత పనుల్లో భాగంగా ఇంటి మేడపైకి వెళ్తుండగా 33 కేవీ విద్యుత్ వైర్లు తగిలి షాక్ కొట్టింది. దీంతో ఆయన రెండు కాళ్లు, చేతులతో పాటు కిడ్నీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ మేరకు కుటుంబసభ్యులు ఆయనను హుటాహుటిన ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని కుటుంబసభ్యులు వాపోతున్నారు. మెరుగైన వైద్యం అందించేందుకు ఆర్థికంగా ఆయన కుటుంబం అంతంతమాత్రంగా ఉండడంతో దాతలు ముందుకు రావాలని సహ ఉద్యోగులు కోరుతున్నారు. ఇప్పటికే సహచర కార్యదర్శులు తోచిన సాయం అందించారు. మండల పరిధిలో ప్రజాప్రతినిధులు తమ దాతృత్వం చాటుకుంటున్నారు. సాయం చేయదలచివారు ఫోన్ 6281691501 నంబర్‌ను సంప్రదించాలని మండల పరిషత్ సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నారు.

కుందరతిరువాడలో ఏనుగుల సంచారం



కుందరతిరువాడ పంట పొలాల్లో ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని చినకుదమ, దకుదమ, చుకవలస పంట పొలాల్లో ఉన్న ఏనుగులు శుక్రవారం కుందరతిరువాడలో సంచరించాయి. ఈ సందర్భంగా గ్రామంలోని అరటి పంటను ధ్వంసం చేస్తుండడంతో రైతులు వాపోతున్నారు. గ్రామ పరిసరాల్లో ఆరు ఏనుగుల గుంపు సంచరించడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.ఏనుగులను అడవికి పంపించే ఏర్పాట్లు చేయాలని రైతులు అటవీ సిబ్బందిని కోరుతున్నారు.